సాక్షి
నంద్యాల
మంగళవారం : 18 : మార్చి : 2025





**శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన**

శ్రీశైలంటెంపుల్:శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.




**అంతర్గత బదిలీలకు తిలోదకాలు**

శ్రీశైల దేవస్థానంలో మూడు నెలలకోసారి అంతర్గత బదిలీలు చేయాల్సి ఉంది. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చినా గాలికొదిలేశారు. కొందరు తొమ్మిది నెలలుగా ఒకే తిష్టవేశారు. 8లో▸



**పొలం వద్దే ప్రాణాలొదిలిన రైతు**

పైరు కాపలా కోసమని పొలానికెళ్లిన రైతు చాకలి మధు(38) అక్కడే ప్రాణాలొదిన ఘటన ఆదివారం రాత్రి కొత్తపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. 8లో▸

## న్యూస్‌రీల్

### పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పాలిసెట్ -2025 నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15వ తేదీ తుది గడువు అని నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 దరఖాస్తు రుసుం హెల్ప్‌లైన్/గేట్‌వే ద్వారా చెల్లించవచ్చన్నారు. వెబ్‌సైట్ https://polycetap.nic.in/default.aspxలో దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అర్హులని, పాలిసెట్ పరీక్ష ఏప్రిల్ 30వ తేదీన ఉంటుందన్నారు. విద్యార్థులకు నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ ఇస్తారని చెప్పారు. మరింత సమాచారం కోసం జి.సురేష్‌బాబు(9912377723), విష్ణువర్ధన్‌రెడ్డి (9603970847) నంబర్లను సంప్రదించాలన్నారు.

### నేటి నుంచి సుయతీంద్ర తీర్థుల సమారాధన



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి, నవ మంత్రాలయ రూపశిల్పిగా పేరుగాంచిన సుయతీంద్రతీర్థుల సమారాధన వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థుల గురువులైన సుయతీంద్రతీర్థుల 12వ సమారాధన వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం పూర్వారాధన, బుధవారం మద్యారాధన, గురువారం ఉత్తరారాధన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతి రోజూ ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మద్యారాధన రోజు మహా పంచామృతాభిషేకం, స్వర్ణ రథోత్సవాలు జరపనున్నారు. పలువురు విద్వాన్‌లచే రోజూ ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించనున్నారు.

### 22 నుంచి నాలుగు రోజులు బ్యాంకుల బంద్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 22 నుంచి వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. ఈనెల 22వ తేదీ 4వ శనివారం కావడంతో బ్యాంకులకు సెలవు. 23న ఆదివారం కాగా.. 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె జరుగనుంది. రెండు రోజుల సమ్మెలో గ్రామీణ బ్యాంకులు, కో-ఆపరేటివ్ బ్యాంకులతో సహా పబ్లిక్ సెక్టారు బ్యాంకులన్నీ పాల్గొననున్నాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు వివిధ డిమాండ్‌లను సాధించుకునేందుకు రెండు రోజుల పాటు బ్యాంకుల బంద్ పాటిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ నాగరాజు తెలిపారు.

### క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వి. వెంకట బసవరావు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా సోమవారం రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య వి. వెంకట బసవరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు క్లస్టర్ వర్సిటీ వీసీగా పని చేస్తున్న ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ పదవీ కాలం ఇటీవలే ముగిసింది. అయితే రెండు వారాల కుపైగా ఖాళీగా ఉన్న వీసీ పోస్టును ఆర్‌యూ వీసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయనకు క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. వర్సిటీ అనుబంధ కాలేజీల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# వేదిక.. పరిష్కరించలేక!

- పరిష్కారం కాని సమస్యలు
- అనేక సార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం శూన్యం
- మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- రికార్డుల్లో తప్పుడు సమాచారం నమోదు
- భూ కబ్జాలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినా కనిపించని స్పందన



సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చేందుకు నంద్యాల కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం పేరుకే నిర్వహిస్తున్నారని, సమస్యలు పరిష్కరించేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేపదే కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కష్టాలు తొలగడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. కింది స్థాయి అధికారులు సమస్యలు పరిష్కరించకుండా ఫొటో తీసుకొని, సంతకం పెట్టించుకొని ఉన్నతస్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రతి సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నంద్యాల జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయసాలు ఓర్చుకొని వస్తున్నారు. ఒకే సమస్యపై అధికారులను కలుస్తున్నా వినతి పత్రంపై ఎండార్స్ చేయడం తప్ప వారికి ఏమాత్రం న్యాయం జరగడం లేదు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వస్తున్న ప్రజల సమస్యలు ఏ మాత్రం పరిష్కారమవుతున్నాయో తెలుసుకోవడానికి సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ నిర్వహించింది. పలు వాస్తవాలు వెలుగు చూశాయి.

**పదేపదే ప్రదక్షిణ..**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఒకే సమస్య పరిష్కారం కోసం నాలుగైదు సార్లు అర్జీలు అందజేసినా ఫలితం లేకపోవడంతో మళ్లీ మళ్లీ వస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు భూ సమస్యలు అధికంగా వస్తున్నాయి. భూములు ఆక్రమించుకుంటున్నారని, భూముల కొలతలు వేయడం లేదని, ఆన్‌లైన్‌లో తమ భూములను ఎక్కించడం లేదని అర్జీలు ఇస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

**టీడీపీ నాయకుల హవా..**

పీజీఆర్ఎస్‌కు బాధితులు రావడం, అధికారులు వినతి పత్రంపైన ఎండార్స్‌మెంట్ చేస్తూ కింది స్థాయి అధికారులకు పంపుతున్నారు. అయితే టీడీపీ నాయకులు చెప్పనిదే కింది స్థాయి అధికారులు పని చేయడం లేదు. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు పని చేయవద్దని బహిరంగంగా చెప్పడంతో టీడీపీ నాయకులు మరింత రెచ్చిపోతున్నారు. మండలం, గ్రామంలో ఏ పని చేయాలన్నా మమ్మల్ని సంప్రదించాలని టీడీపీ నాయకులు.. అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో పీజీఆర్ఎస్ కార్యక్రమం మొక్కుబడి రీతిలో కొనసాగుతోంది.

| 2024 జూన్ 15 నుంచి ఇప్పటి వరకు అర్జీల వివరాలు | |
|---|---|
| అర్జీలు | 30,058 |
| పరిష్కారం | 27,854 |
| పెండింగ్ | 2204 |

### చర్యలు తీసుకోవాలని అర్జీ



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇద్దరు వృద్ధుల పేర్లు సాలమ్మ, పుష్పవతి. సొంత అక్కాచెల్లెళ్లు. వీరిది పాణ్యం మండలం భూపనపాడు గ్రామం. వీరి తల్లిదండ్రులు భూపనపాడు గ్రామంలో రెండెకరాల భూమిని ఇతరుల నుంచి కొనుగోలు చేశారు. అప్పటికే ఆభూమిని వీరి సోదరుడి కుమారుడు సురేష్ అనుభవిస్తున్నాడు. అక్కాచెల్లెళ్లు కోర్టును ఆశ్రయిస్తే .. రెండెకరాల భూమిని ముగ్గురికి పంపకాలు చేసింది. ఈప్రకారం పాణ్యం రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో పేర్లు చేర్చి పాస్‌బుక్‌లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఇద్దరు వృద్ధులు పొలం సాగు కోసం వెళితే ''ఇక్కడ మీభూమి లేదు'' అంటూ సోదరుడి కుమారుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడు. తమను ఇబ్బందులకు గురి చేస్తున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని అర్జీలు ఇచ్చారు.

### పట్టించుకోవడం లేదు



అర్జీ చూపిస్తున్న ఈ రైతు పేరు రవిప్రకాశ్‌రెడ్డి. ఈయన అవుకు మండలం శివవరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పొలం సమీపంలో ఎస్సార్బీసీ కాలువ ఉందని, అందులో నుంచి వచ్చే నీటితో పంట సాగు చేసుకునేందుకు వీలు పడటం లేదని ఈయన ఆవేదన. ఇప్పటికే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఐదు సార్లు వచ్చి విన్నవించానని, తహసీల్దార్‌కు సమస్యను పరిష్కరించాలని సూచిస్తున్నా ఫలితం లేకుండా పోతుందని కన్నీటి పర్యంత అయ్యారు.

### ఏం చేయాలి?



నాకు 30 సెంట్ల స్థలం ఉండగా 25 సెంట్లు మాత్రమే చూపుతున్నారు. మిగిలిన 5 సెంట్ల స్థలానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని అర్జీ ఇవ్వగా గ్రామస్థాయిలో సిబ్బంది నావద్దకు వచ్చారు. నాకు తెలియకుండానే నా సమస్యను పరిష్కరించినట్లు ఫొటోలు కొట్టుకొని వెళ్తున్నారు. సమస్య పరిష్కారమైనట్లు అధికారులు చెబుతుండటంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. – గాజుల వెంకటరమణ, తంగడంచె, జూపాడుబంగ్లా మండలం

### మూడుసార్లు అర్జీలు ఇచ్చా



మేం ముగ్గురు అన్నదమ్ములం. మాకు పొలం, ఇళ్ల స్థలాలు ఉన్నాయి. అయితే అధికారులు మా వాటా కింద వచ్చిన పొలాలను సక్రమంగా సర్వే చేసి చూపించడం లేదు. ఇప్పటికే జిల్లాలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మూడుసార్లు వచ్చి అర్జీలు ఇచ్చాం. జిల్లా కేంద్రంలో అధికారులు చెప్పే మాట ఒకలా ఉంటే మండల స్థాయిలో అధికారుల తీరు మరో విధంగా ఉంటోంది. –పెద్దకాశన్న, శ్రీరంగాపురం, రుద్రవరం మండలం

### ఎవరు న్యాయం చేస్తారు?



మాకు తల్లిదండ్రుల నుంచి వచ్చిన పొలం ఆస్తిగా ఉంది. రికార్డుల ప్రకారం అడంగల్‌లో వారసత్వం ఉండగా వన్‌బీలో దానం కింద నమోదు అయి ఉంది. మాకు వారత్వం ఆస్తిగా మార్చాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. 2023లో వన్‌బీలో వారసత్వం ఉండగా 2025లో అదే ఆస్తి దానం కింద వన్‌బీలో నమోదు అయి ఉంది. ఈ రికార్డులన్నీ మాకు తెలియకుండానే అధికారులు మార్పు చేస్తున్నారు. మాకు ఎవరు న్యాయం చేస్తారు. –కురువ రామలింగడు, యాపదిన్నె, డోన్ మండలం

### అవస్థలు పడుతున్నాం



ఒకే సర్వే నంబరులో నాకు 65 సెంట్లు, మరొకటి 63 సెంట్లు భూమి ఉంది. ఆ భూమిలో పైర్లను సాగు చేస్తూ మేం అనుభవంలో ఉన్నాం. సర్వే చేయించగా తక్కువ భూమిని చూపిస్తున్నారు. రికార్డుల్లో మాత్రం తప్పుడుగా చూపుతున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు అర్జీలు ఇచ్చాం. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అవస్థలు పడుతున్నాం. –శిరిగిరి వెంకటయ్య, హైస్కూల్ కొట్టాల, నంద్యాల మండలం

### మళ్లీ విన్నవించుకున్నా



మా ఊర్లో వెట్టి బ్యాగరోళ్లకు చెందిన పది కుటుంబాలకు వెట్టి కింద 6.65 ఎకరాల భూమి కేటాయించారు. కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించుకొని భూమి ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌కు నాలుగు సార్లు వినతులు అందజేసినా ఫలితం లేదు. మహానంది తహసీల్దార్‌కు కూడా ఆరు సార్లు విన్నవించగా ఎలాంటి స్పందన కనిపించలేదు. ప్రభుత్వ భూమిని కేటాయించాలని మళ్లీ విన్నవించుకున్నాం. – చంద్రుడు, తిమ్మాపురం, మహానంది మండలం

### ఫలితం రాలేదు



నాకు 3.50 సెంట్ల స్థలం ఉండగా కొందరు ఆక్రమించుకున్నారు. స్థలం చూపించాలని అధికారుల చుట్టూ ఆరు సార్లు తిరిగినా ఫలితం రాలేదు. ఈ రోజు రేపు అంటూ అధికారులు కాలం గడుపుతున్నారు. కొలతలు వేయించి నా స్థలం చూపించాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నా. –రత్నం, విశ్వనగర్, నంద్యాల

### ఎన్ని సార్లు తిరగాలి?



నాకు 5.40 ఎకరాలు భూమి ఉండగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు రూ.10వేలు ఇచ్చాను. నా పొలం ఆన్‌లైన్ చేయలేదు. నా భూమికి సంబంధించిన ఖాతా నంబరు తొలగించి వేరేవారి ఖాతాపేరుపై నా భూమిని ఎక్కించారు. డోన్ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఐదు సార్లు తిరిగి ఫలితం లేదు. మూడుసార్లుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసినా ఫలితం లేదు. ఇంక ఎన్ని సార్లు తిరగాలో అర్థం కావడం లేదు. –చెరుకూరి నాగమ్మ, డోన్

### అర్జీలన్నింటినీ పరిష్కరిస్తున్నాం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలన్నింటినీ పరిష్కరిస్తున్నాం. అర్జీలు పరిష్కారం కావడం లేదన్నది అవాస్తవం. ఎన్ని సమస్యలు వచ్చాయి.. ఎన్ని పరిష్కారమయ్యాయి.. రికార్డులో చూస్తే తెలిసిపోతుంది. భూ సమస్యలు కొంత ఆలస్యమైనా పరిష్కరిస్తున్నాం. కొన్ని అర్జీలు మళ్లీ వస్తున్నాయి. వాటి పరిష్కారానికి గడువు 30 రోజులు, 14 రోజుల వరకు ఉంటుంది. ఆ గడువు ముగియకుండానే కొందరు మళ్లీ అర్జీలు ఇస్తున్నారు. పీజీఆర్ఎస్‌లో వస్తున్న సమస్యలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని చేసేలా కింది స్థాయి అధికారులను ఆదేశిస్తున్నాం. –జి.రాజకుమారి, జిల్లా కలెక్టర్, నంద్యాల

# అసౌకర్యాల మధ్యనే పది పరీక్షలు



నంద్యాలలోని పరీక్ష కేంద్రం వద్ద పదో తరగతి విద్యార్థులతో తల్లిదండ్రులు



డోన్ పట్టణంలోని ఓ పాఠశాల వద్ద ఎండలో నిల్చున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్)/చాగలమర్రి/బొమ్మలసత్రం/డోన్ టౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పలుచోట్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు కొన్ని తప్పిదాలు చేశారు. మొదటి రోజు తెలుగుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 130 కేంద్రాల్లో 24,907 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. అయితే 24,512మంది విద్యార్థులు పరీక్ష రాయగా 394 మంది గైర్హాజరయ్యారు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, నంద్యాలతో పాటు 20 పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్ అబ్రహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పరీక్ష కేంద్రం మార్పు**

నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ పరీక్ష కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఉదయం డీఈఓ జనార్దన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఈఓ స్పందిస్తూ బుధవారం జరిగే పరీక్షకు కేంద్రాన్ని పక్కనున్న ఎస్పీజీ జూనియర్ కళాశాలలోకి మారుస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి చెందారు.

**అరగంట ఆలస్యంగా ప్రశ్నపత్రం**

పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే చాగలమర్రి ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు ఇవ్వాల్సిన ప్రశ్న పత్రాన్ని అరగంట ఆలస్యంగా 10.00 గంటలకు ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. తెలుగు ప్రశ్నపత్రాలు పాత, కొత్త సిలబస్ ప్రకారం వచ్చాయని, వాటిని గుర్తించి వేరు చేయడంతో 10 నిమిషాలు ఆలస్యం అయ్యిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

**ముగ్గురికి షోకాజ్ నోటీసులు**

నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఒక విద్యార్థికి జీరోవన్‌టీ కాకుండా జీరోత్రీటీ ప్రశ్నపత్రం ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థి ఆ పరీక్షనే రాశారు. తప్పుడు ప్రశ్నపత్రం ఇచ్చిన ఇన్విజిలేటర్, చీఫ్ డిపార్టుమెంటల్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు ముగ్గురికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈఓ తెలిపారు. ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేశామన్నారు.

**పోలీస్ భద్రత పరిశీలన**

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. నంద్యాల ఎస్పీజీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ భద్రతను ఆయన పరిశీలించారు. విద్యార్థులు నిర్దేశించిన సమయంలో కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఎస్పీతో పాటు సీఐలు కంబగిరి రాముడు, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఎండలో విద్యార్థులు**

డోన్ బాలికల హైస్కూల్‌లో పదోతరగతి పరీక్షలు జరుగుతున్నాయి. స్కూల్ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించాల్సి ఉంది. అయితే విద్యార్థినులు 12 గంటలకే వచ్చారు. స్కూల్ గేట్లు మధ్యాహ్నం 12.45 గంటల వరకు తెరవక పోవడంతో రోడ్డుపై ఎండలో నిలుచోవాల్సి వచ్చింది.

# కన్న ప్రేమకు 'పరీక్ష'





కుమారుడు దిలీప్‌ను ఆటోలో తీసుకొచ్చిన తల్లి దేవి, కుమారుడిని పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్తున్న తల్లి

ఉయ్యాలవాడ: కన్న తల్లి ప్రేమ వెలకట్టలేనిది. పిల్లాడి మానసిక స్థితి ఎలా ఉన్నా ఆ తల్లికి అతనిలో రాజకుమారుడే కనిపిస్తాడు. సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మానసిక వికలాంగుడైన కుమారుడిని ఓ తల్లి భుజానికెత్తుకొని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన తీరు ప్రతి ఒక్కరినీ హృదయాలను ద్రవింపజేసింది. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన మారెన్నగారి బాలపుల్లయ్య, దేవి దంపతుల కుమారుడు దిలీప్ కుమార్ పుట్టుకతోనే మానసిక వికలాంగుడు. 1 నుంచి 8వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించాడు. అనంతరం సొంత గ్రామానికి సమీపంలో వున్న ఉయ్యాలవాడ మండలం హరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్నాడు. సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను రాయించేందుకు కుమారుడి తల్లి ఆటోలో పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చింది. అక్కడి నుంచి భుజానికెత్తుకొని కేంద్రంలోకి తీసుకెళ్లింది. కుమారుడు ప్రశ్నలకు జవాబులు చెబుతుండగా స్రైబ్ సలీమ్ రాస్తున్నట్లు తల్లి దేవి వివరించింది. కుమారుడి భవిష్యత్ కోసం తల్లి తపనను చూసి పరీక్ష రాసేందుకు వచ్చిన మిగిలిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆనంద బాష్పాలు కార్చారు.

# పండుగలు ఉన్నా.. ప'రేషాన్'

- రేషన్ సరుకుల్లో భారీ కోత
- కార్డుదారులకు అందని కందిపప్పు
- ఇంటి వద్దకు రాని ఎండీయూ వాహనాలు
- ఇప్పటి వరకు రంజాన్ తోఫా ఊసేలేదు
- ఉగాది పండుగ వస్తున్నా అందని నిత్యావసరాలు
- ప్రజలకు తప్పని తిప్పలు

కోవెలకుంట్ల: పేదల సంక్షేమాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా అందించే రేషన్ సరుకుల్లో భారీగా కోత పెడుతోంది. కార్డుదారులకు అన్ని రకాల సరుకులు అందడం లేదు. రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర తప్ప మిగిలిన నిత్యావసరాలు పంపిణీ కావడం లేదు. ఈ నెల హిందువులకు, ముస్లింలకు పెద్ద పండుగలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో కనీస స్పందన కరువైంది. ప్రజలకు బియ్యం, చక్కెర మినహా మిగిలిన ఏ ఒక్క నిత్యావసర సరుకులు అందలేదు. జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, శ్రీశైలం, రుద్రవరం, నందికొట్కూరు, నంద్యాల, ప్యాపిలి మండలాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఆయా ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో 1,204 రేషన్ షాపులు ఉండగా 351 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా ప్రజా పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలో 5.33 లక్షల రేషన్‌కార్డులకు సంబంధించి ప్రతి నెలా 71,074 క్వింటాళ్ల బియ్యం, 2,666 క్వింటాళ్ల చక్కెర సరఫరా చేస్తున్నారు.

**పండుగలు ఎలా జరుపుకోవాలి?**

జిల్లాలో మార్చి నెలకు సంబంధించి కార్డుదారులకు బియ్యం, చక్కెరతోనే సరిపెట్టారు. కందిబేడలకు మార్కెట్‌లో ధర పెరగడంతోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెట్టినట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ. 150 ధర పలుకుతుండటంతో పేద, సామాన్య ప్రజలుకు కొనడం భారంగా మారింది. ఈ నెలలో కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరులో హిందువులకు ఉగాది పండుగ ఉంది. అలాగే ముస్లింలకు పవిత్ర రంజాన్ పండుగ వస్తోంది. పండుగల నేపథ్యంలో సైతం ప్రభుత్వం కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వలేదు. పండుగలు ఎలా జరుపుకోవాలని ఆందోళన చెందుతున్నారు.



ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

**రంజాన్ తోఫా ఒట్టిదేనా..**

2014 నుంచి 2019వ సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హిందువుల ముఖ్య పండుగలతోపాటు రంజాన్ పండుగకు పండుగ తోఫా పేరుతో వివిధ రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేసింది. 2024 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క పండుగకు తోఫాలు పంపిణీ చేయలేదు. గతంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని కార్డుదారులైన ముస్లిం కుటుంబాలకు గోధుమపిండి, చక్కెర, సేమియా, ఆయిల్, నెయ్యితో కూడిన తోఫా అందజేసింది. ఈ నెల 31వ తేదీన రంజాన్ పండుగ ఉండటంతో ఇప్పటి వరకు రంజాన్ తోఫా ఊసే లేకపోవడంతో ముస్లింలు పెదవి విరుస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, చక్కెర తప్ప ఇతర సరుకులు ఇవ్వకపోగా రంజాన్ పండుగకు ఎలాంటి సరుకులు ఇచ్చే పరిస్థితి లేకపోలేదు.

**ఎండీయూ వాహనాలేవీ?**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో కొందరు ఆపరేటర్లు విధుల నుంచి తప్పుకోవడం, కొన్ని గ్రామాల్లో ఆపరేటర్లను బలవంతంగా తొలగించారు. ఎండీయూ వాహనాలు లేని గ్రామాల్లో డీలర్లు ఇళ్ల వద్ద ప్రజా పంపిణీని కొనసాగిస్తున్నారు. గతంలో ఇంటి వద్దనే సరుకులు అందేవని, ప్రస్తుతం డీలర్ల ఇంటి వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందని కార్డుదారులు వాపోతున్నారు. మరికొన్ని వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఎండీయూ వాహనాల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఒకవైపు సరుకుల్లో కోత, మరోవైపు సరుకులు సక్రమంగా ఇంటికి సరఫరా కాక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు బియ్యం, చక్కెరతోపాటు కందిపప్పు, జొన్నలు, రాగులు, తదితర నిత్యావసర సరుకులు కార్డుదారుల ఇళ్లవద్దనే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### త్వరలో సరఫరా చేస్తాం


కోవెలకుంట్ల స్టాక్ పాయింట్‌కు మార్చి నెలకు సంబంధించి కందిపప్పు కొంత మేర సరఫరా అయింది. ఈ నెల 20 తర్వాత పూర్తిస్థాయిలో అందుతుంది. కంది పప్పు వచ్చిన వెంటనే కార్డుదారులకు పంపిణీ చేస్తాం. – నాగేశ్వరరెడ్డి, సీఎస్ డీటీ, కోవెలకుంట్ల

### కందిపప్పు ఇవ్వలేదు



మార్చి నెలకు సంబంధించి బియ్యం, చక్కెర మాత్రమే సరఫరా చేశారు. కందిపప్పు ఇవ్వలేదు. గతంలో వీటితోపాటు జొన్నలు, రాగులు, తదితర నిత్యావసరాలు అందించారు. కందిపప్పు, ఇతర నిత్యావసరాలు అందకపోవడంతో బయటి మార్కెట్‌లో అధిక ధర పెట్టి కొనుగోలు చేయడం భారంగా మారింది. – రఘు, కార్డుదారుడు, కోవెలకుంట్ల

### రంజాన్ తోఫా ఇవ్వాలి



గతంలో రంజాన్ పండుగకు గోధుమపిండి, చక్కెర, సేమియాలు, ఆయిల్, నెయ్యితో కూడిన తోఫా ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఎలాంటి తోఫాలు ఇవ్వడం లేదు. ఈ నెల 31వ తేదీన రంజాన్ పండుగ ఉంది. పండుగను దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరిగానే రంజాన్ తోఫా ద్వారా సరుకులు అందజేయాలి. – దస్తగిరి, కార్డుదారుడు, కోవెలకుంట్ల

## క్లుప్తంగా

### ప్రసవ వేదనతో ఉపాధ్యాయిని మృతి


కవిత (ఫైల్)

**కోసిగి:** మండల కేంద్రంలోని చాకలిగేరి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కవిత(28) ప్రసవ వేదనతో ఆత్మకూరు ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందిందారు. సోమవారం ఉదయం ఎంఈఓ శోభరాణి, హెచ్ఎం సుబ్బలక్ష్మి తెలిపిన వివరాలు.. పాములపాడు మండలం బానుముక్కల గ్రామానికి చెందిన కవిత 2018 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై 2020 సెప్టెంబర్ 27న కోసిగి చాకలిగేరి ప్రాథమిక పాఠశాలలో చేరింది. ఏడాది క్రితం సచివాల ఉద్యోగి వినోద్‌తో వివాహం కాగా మూడు నెలల క్రితం మెటర్నిటీ సెలవుల్లో సొంత గ్రామం బానుముక్కలకు వెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రసవ సమయంలో ఆమె హైబీపీతో ఆస్పత్రిలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం

**బండి ఆత్మకూరు:** మండల పరిధిలోని కడమల కాలువ గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహిళపై కొన్నిరోజుల క్రితం ఆర్ఎంపీ సుబ్బరాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇదే విషయమై గతంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన పైనే ఫిర్యాదు చేస్తావా అంటూ ఆర్ఎంపీతో పాటు అతని తండ్రి సోమవారం తెల్లవారుజామున మహిళ ఇంటి మీదకు వెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. భయాందోళనకు గురైన మహిళ పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ జగన్‌మోహన్‌ను వివరణ కోరగా జరిగిన ఘటనపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

### జలవనరుల శాఖలో పదోన్నతులు

**కర్నూలు (సిటీ):** జలవనరుల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వారికి అడ్‌హక్ విధానంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు కల్పించి పోస్టింగులు ఇస్తూ ఆ శాఖ ప్రత్యేక స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 11 మంది ఇంజినీర్లు పదోన్నతులు పొందారు. ఎస్ఆర్‌బీసీ సర్కిల్1లోని సబ్ డివిజన్3లో డీఈఈగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.నాగేంద్రకుమార్ (తెలుగు గంగ), ఎం.రమేష్ బాబు(ఎస్ఆర్‌బీసీ క్వాలిటీ కంట్రోల్), ఎస్.గుణకర్‌రెడ్డి (సీఈ ఆఫీస్, కర్నూలు), ఎం.వేణుగోపాల్ రెడ్డి(ఎస్ఆర్‌బీసీ సర్కిల్1), ఎస్.మురళి (జీఆర్‌పీ), ఎం.మల్లికార్జున రెడ్డి(ఎస్ఆర్‌బీసీ సర్కిల్1), పి.శరత్‌కుమార్ (తెలుగు గంగ), బి.మహేష్ (సీఈ ఆఫీస్, కర్నూలు), ఎస్.శివప్రసాద్ (హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్1), టి.రాధాకృష్ణ (ఎస్ఆర్‌బీసీ సర్కిల్1) పదోన్నతి పొందారు. వీరందరికీ పదోన్నతులు కల్పించి పోస్టింగ్ ఇచ్చారు.

### మృతదేహం లభ్యం

**పెద్దకడబూరు:** మండల పరిధిలోని పులికనుమ ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం రాత్రి లభ్యమైంది. మండల పరిధిలోని హులికన్వీ గ్రామానికి చెందిన మస్కి నాగేంద్ర శనివారం రాత్రి చేపలు పట్టడానికి పులికనుమ ప్రాజెక్టులో దిగి గల్లంతైన విషయం విధితమే. ఆదివారం గాలించినా మృతదేహం ఆచూకీ దొరక్క పోవడంతో సోమవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు చిన్న లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## గురివిందను నేనే!



'గురివింద తన నలుపు ఎరగదంట' అంటుంటారుగా.. అది నేనే. ఎందుకంటారో తెలుసా? నేను చూడటానికి **ఎర్రగా,** భలే అందంగా ఉంటాను. **ఇం**త అందంగా ఉన్న నా ఒంటిపై ఒక్క చోట మాత్రం నల్లటి మచ్చ ఉంది. ఇది నేనెవరికీ చెప్పుకోను లెండి. అందుకే ఏదైనా గొప్పలు చెప్పుకునే వారిని ఉద్దేశించి మాట్లాడేటప్పుడు నన్ను పోల్చి చెప్పడం ఈ **జనాలకు** అలవాటు. నన్ను చూసిన వారు అరుదే. వారికి కూడా నా జాతి పెద్దగా తెలియదు. నేను తీగ జాతికి చెందినదాన్ని. మిగతా చెట్లకు అల్లుకుపోయి జీవనం సాగిస్తుంటాను. ఒకప్పుడు నన్ను బంగారం తూకం వేయడానికి ఉపయోగించేవారు. లక్ష్మీ స్వరూపంగా కొలిచేవారు. శుభసూచికంగా కొందరు ఇంట్లో పూజగదిలో, బీరువాలో పెట్టుకుంటే అదృష్టం, ఐశ్వర్యం వస్తాయని విశ్వసిస్తారు. నా ఎరుపు రంగును కుజగ్రహ, నలుపు రంగును శనిగ్రహ దోష నివారణలకు ఉపయోగిస్తారు. చేతులకు కంకణాలుగా, కాళ్లకు కడియాలుగా కట్టుకుంటారు. ఇటీవల నా జాతి కాస్త అంతరించి పోతోందని బాధ పడుతున్న తరుణంలో కొందరు పట్టణవాసులు ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి నన్ను తెప్పించుకుంటుండటం ఆనందమేస్తోంది. – దొర్నిపాడు

## జీవాలకు వదిలేశారు!

**రైతుకు ఈ ఏడాది** మిర్చి పంట కలిసి రాలేదు. తెగుళ్లతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోగా.. అంతంత మాత్రంగా వచ్చినా గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యారు. రుద్రవరం మండలంలోని చిలుకలూరు, బీరవోలు, ఆలమూరు తదితర గ్రామాల పరిధిలోని రైతులు దాదాపు వంద ఎకరాల్లో పండు మిర్చి పంట సాగు చేశారు. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు ఓ మోస్తరుగానే వచ్చినా విక్రయించే సమయంలో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంలో విఫలమైంది. గతేడాది క్వింటా రూ.23 వేలకు పైగానే పలికిన మిర్చి.. ఈ ఏడాది రూ.10 వేలకు మించడంలేదు. ఆ ధరకు అమ్ముకుంటే కూలీలు, రవాణా చార్జీలకు కూడా సరిపోవడం లేదనే ఉద్దేశంతో మిర్చి కోతలు నిలిపేసి జీవాలకు వదిలేస్తున్నారు. – రుద్రవరం



## విదేశీ కరెన్సీ కేసులో ఢిల్లీ మహిళ అరెస్ట్

- ఇదే కేసులో గత నెలలో నలుగురు అరెస్ట్

**కోవెలకుంట్ల:** విదేశీ కరెన్సీ(డాలర్లు)ఆశ చూపి ఇద్దరు అమాయకులను నమ్మ బలికించి ఘరానా మోసం చేసిన కేసులో మరో నిందితురాలిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. నంద్యాలకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా, శ్రీనివాసులుకు గత నెల 8న గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు పరిచయమై రూ.10 లక్షల నగదు ఇస్తే రూ.20 లక్షల విలువ చేసే డాలర్లు ఇస్తామని నమ్మబలికారు. రెట్టింపు డబ్బు వస్తుందనే ఆశతో ఇద్దరు వ్యక్తులు చెరో రూ.5 లక్షలు కోవెలకుంట్లకు తీసుకొచ్చి వారిలో చేతిలో పెట్టారు. దుండగులు ఒక మూట వారి చేతిలో పెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. మూట విప్పి చూడగా అందులో విదేశీ కరెన్సీ స్థానంలో ఖాళీ పేపర్లు ఉండటంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదే నెలలో అస్సాం రాష్ట్రానికి చెందిన మహమ్మద్ ఆరిఫ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉజ్వల్ దారి, టూటుల్ షేక్ ఇమ్రాన్‌ఘాజీలను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. మరో నిందితురాలు ఢిల్లీకి చెందిన నజ్మను సోమవారం ఉదయం భర్త ఇమ్రాన్‌ఘాజీ బెయిల్ విషయమై కోవెలకుంట్లకు వచ్చినట్లు తెలుసుకుని నిఘా ఉంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పొలం వద్దే ప్రాణాలొదిలిన రైతు


మృతి చెందిన చాకలి మధు

**కొత్తపల్లి:** పైరు కాపలా కోసమని పొలానికెళ్లిన రైతు అక్కడే ప్రాణాలొదిలన ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన రైతు చాకలి మధు(38) ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని 3 ఎకరాల్లో వేరుశనగ, 3 ఎకరాల్లో మినుము సాగు చేశాడు. సమీపంలో నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో అడవి పందుల బెడద నుంచి వేరుశనగ పైరును కాపాడుకునేందుకని రాత్రి కాపలా కోసమని పొలానికి వెళ్లి అక్కడే నిద్రించాడు. సోమవారం ఉదయం అతని స్నేహితుడు పాతకోట వెంకటరమణ డీజిల్ కోసమని మధు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.కేశవ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. విషపురుగు కాటుతో మృతిచెంది ఉండొచ్చని పలువురు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కర్నూలు:** మధ్య వయసు మహిళను బెదిరించి లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడు ఉప్పు నాగహరికృష్ణకు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి వి.లక్ష్మీరాజ్యం సోమవారం తీర్పు చెప్పారు. 2020 డిసెంబర్ 5న బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సంజామల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలు.. తెలంగాణ రాష్ట్రం కోసిగి గ్రామానికి చెందిన మహిళ తన సోదరుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స కోసమని 2020 డిసెంబర్ 3న సంజామల మండలం పేరుసోముల గ్రామ సమీపంలో విష్ణుగంటి క్షేత్రం వద్దకు తీసుకొచ్చింది. రాత్రి బాధిత మహిళ నిద్రపోయిన తర్వాత సోదరుడు కనిపించకుండా పోయాడు. సోదరుడిని వెతుకుతున్న మహిళ వద్దకు హరికృష్ణ అనే వ్యక్తి వచ్చి ఎస్ఆర్‌బీసీ కాలువ వద్ద ఉన్నాడని, మోటార్‌సైకిల్ ఎక్కించుకుని కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ఉప్పు నాగహరికృష్ణను అరెస్టు చేసి ఏడవ అదనపు జిల్లా కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నాగహరికృష్ణకు జీవిత కాలం శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## నేడు హాకీ ఎంపిక పోటీలు

**కర్నూలు (టౌన్):** స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 18 వ తేదీ ఉదయం 11 గంటలకు బాలుర విభాగంలో జూనియర్ హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి నెల 1వ తేదీ 2006 సంవత్సరం తరువాత పుట్టిన వారు ఈపోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 3 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు ధర్మవరంలో జరిగే 10 వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9966565317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఎక్సైజ్‌లో అసోసియేషన్ ఎన్నికల కోలాహలం

- జోరుగా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు
- ఈనెల 23న పోలింగ్


అధ్యక్ష పదవి రేసులో ఉన్న ఓబులేసు, గిరిబాబు

**కర్నూలు:** ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. మూడేళ్లకోసారి జరగాల్సిన అసోసియేషన్ ఎన్నికలు తొమ్మిదేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధ్యక్ష పదవి రేసులో ఉన్న ఓబులేసు, వైవీ గిరిబాబు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఓబులేసు నంద్యాల డీటీఎఫ్‌లో పనిచేస్తుండగా మరో అభ్యర్థి గిరిబాబు కర్నూలు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ 1995 బ్యాచ్‌కు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు. ఎక్సైజ్ శాఖలోకి డిప్యూటేషన్‌పై వచ్చి ఇక్కడే విలీనమయ్యారు. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్లతో పాటు 2014 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఐఎంఎల్ డిపో, కారుణ్య నియామకం కింద ఎంపికైనవారు వివిధ విభాగాల్లో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 135 మంది కానిస్టేబుళ్లు, 75 మంది హెడ్ కానిస్టేబుళ్లు కలిపి 210 మంది తమ ఓటు ద్వారా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉంది. అధ్యక్ష పదవికి ఓబులేసు, గిరిబాబు పోటీ పడుతుండగా, ప్రధాన కార్యదర్శి పదవికి విజయ్‌కుమార్, జగన్నాథం పేర్లు వినిపిస్తున్నాయి. ఈనెల 23న కర్నూలు ఎక్సైజ్ కార్యాలయ ఆవరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఎన్నికల తేదీ గడువు సమీపిస్తుండటంతో బరిలో ఉన్న అభ్యర్థులు.. ఎక్సైజ్ స్టేషన్లతో పాటు ఈఎస్‌టీఎఫ్, మొబైల్ పార్టీ, చెక్‌పోస్టు, ఎన్‌ఫోర్స్‌మెంట్, నంద్యాల, కర్నూలు ఈఎస్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని కలిసి తమ విజయానికి దోహదపడాలని అభ్యర్థిస్తున్నారు. ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఇటీవలనే ఎన్నికలు నిర్వహించి ఆ సంఘం అధ్యక్షునిగా రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్న విషయం తెలిసిందే.

## చేపల ఉత్పత్తిని పెంచుతాం

- జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ రంగనాథబాబు

**కర్నూలు(అగ్రికల్చర్):** జిల్లాలో మంచి నీటి వనరులు ఎక్కువగా ఉన్నందున చేపల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ వీవీ రంగనాథబాబు తెలిపారు. సోమవారం ఆయన జిల్లా మత్స్య అధికారిగా బంగారుపేటలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మత్స్య సహకార సంఘం(డీఎఫ్‌సీఎఫ్ఎస్) అధ్యక్షుడు నవీన్‌కుమార్, మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాసులు మత్స్యశాఖ అధికారిని కలిసి పూల బొకేలతో సత్కరించారు. జిల్లాలో చేపల ఉత్పత్తి, వినియోగం తదితర వాటి గురించి వారు ఆయనకు వివరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఈయన నెల్లూరులో మత్స్యశాఖ అసిస్టెంటు డైరెక్టర్‌గా పనిచేస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కర్నూలుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన.. సిబ్బందితో సమావేశమై మత్స్యశాఖ పరిస్థితిని సమీక్షించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన శ్యామల నంద్యాల జిల్లాలోని తన రెగ్యులర్ స్థానానికి వెళ్లారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు
- పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు:** అదనపు కట్నం కోసం అత్త, మామ, బావ కలిసి వేధిస్తున్నారని పత్తికొండకు చెందిన వి.రమాదేవి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 115 ఫిర్యాదులొచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

### వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కర్నూలు ఫుడ్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు తీసుకుని మోసం చేసిన కేసులో కర్నూలుకు చెందిన జాకీర్ బాషా, అయేషా బాను, జహీర్ బాషా అరెస్టయి కండీషన్ బెయిల్‌పై విడుదలయ్యారని, ఈ కేసు దర్యాప్తును పకడ్బందీగా చేసి న్యాయం చేయాలని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సుబ్బయ్య ఫిర్యాదు చేశారు.
- తన కుమారుడు పెద్ద మద్దిలేటి, మనవడు మధు కలిసి తన పొలాన్ని వారి పేరు మీద ఆన్‌లైన్‌లో అడంగల్‌లో ఎక్కించుకున్నారని, పొలం తప్ప తనకు వేరే జీవనాధారం లేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వెంకన్న ఫిర్యాదు చేశాడు.
- డీఆర్‌డీఏ వెలుగు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వెంకటరత్నం ప్రభుత్వ స్కీముల ద్వారా లబ్ధి పొందేలా చేస్తానని ఆశ పెట్టి డబ్బు తీసుకుని మోసం చేశాడని హాలహర్వికి చెందిన శీలం నాగమ్మ ఫిర్యాదు చేశారు.
- పిల్లల చదువుల కోసం చీటీలు వేసి దాచుకున్న డబ్బు ఇవ్వకుండా జొహరాపురం గ్రామానికి చెందిన మహమ్మద్ తప్పించుకుని తిరుగుతున్నాడని ఇందిరమ్మ గృహాలకు చెందిన చాకలి రామచంద్రుడు ఫిర్యాదు చేశారు.

### నంద్యాలలో జిల్లా కేంద్రంలో..

**బొమ్మలసత్రం:** స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కార మార్గాన్ని చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదుల్లో కొన్ని..

- ఆస్తి కోసం తన పెద్ద కుమారుడు శివశంకర్‌గౌడ్ తప్పుడు కేసులు పెట్టి మానసికంగా, శారీరకంగా తనను వేధిస్తున్నారని పగిడ్యాల మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్నగౌడ్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- చుక్కల భూమి జాబితాలో నుంచి తన పొలాన్ని తీసేయిస్తానని నమ్మించి పూజారి నాగేంద్రయ్య రూ. 1.50 లక్షలు కాజేశాడని దొర్నిపాడు మండలం ఉమాపతి గ్రామానికి చెందిన మల్లికార్జున ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

యించాడు.



## అంతర్గత బదిలీలకు తిలోదకాలు

- మూడు నెలలకోసారి బదిలీలు చేయాలని కమిషనర్ ఆదేశాలు
- పట్టించుకోని శ్రీశైలం దేవస్థానం అధికారులు

**శ్రీశైల దేవస్థానంలో** అంతర్గత బదిలీలకు అధికారులు తిలోదకాలిచ్చారు. మూడు నెలలకోసారి అంతర్గత బదిలీలు చేయాలనే దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలను గాలికొదిలేశారు. ఫలితంగా కొందరు ఫెవికాల్ వీరులు దాదాపు తొమ్మిది నెలలుగా కొన్ని విభాగాల్లో తిష్టవేశారు.

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి తరలివచ్చే భక్తులకు సేవలందించేందుకు రాష్ట్ర దేవదాయశాఖ సుమారు 300 మంది రెగ్యులర్ సిబ్బందిని, 1000 మందికి పైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఇతర ఉద్యోగులను నియమించింది. దేవస్థానంలో విధులు నిర్వహించే రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకోసారి ఇతర దేవస్థానాలకు బదిలీ చేస్తారు. ఇక పరిపాలన సౌలభ్యం కోసం, ప్రతి అధికారికి, సిబ్బందికి పాలనలో అనుభవం కోసం ప్రతి మూడు నెలలకోసారి రొటేషన్ పద్ధతిన అంతర్గత బదిలీలు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను పాటించకుండా అధికారులు తమకు నచ్చిన సమయంలో ఇష్టానుసారంగా అంతర్గత బదిలీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈఓల మాట వినని అధికారులు, సిబ్బందిపై కక్ష తీర్చుకునేందుకు మాత్రమే కమిషనర్ ఆదేశాలు ఉపయోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.


దేవస్థాన పరిపాలనా భవనం

### కూటమి ప్రభుత్వం రాగానే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జూలై 8న పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, పలువురు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు పరిచారకులను ఒకేసారి 52 మందిని బదిలీ చేశారు. మరికొన్ని రోజులకు ఏఈఓ, పర్యవేక్షకులను సైతం అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత సుమారు తొమ్మిది నెలలవుతున్నా అంతర్గత బదిలీల ఊసే లేదు. దీంతో వసతి విభాగంలో కొందరు పాతుకుపోయారనే విమర్శలున్నాయి. ఈ విభాగంలోని వారు ప్రొటోకాల్ వ్యవహారాలు, సిఫార్స్ లేఖలకు వసతి గదులు, దర్శనం టికెట్లు కేటాయించాల్సి ఉంటుంది. ప్రాధాన్యత ఉన్న విభాగం కాబట్టి ఇక్కడి నుంచి కొందరు కదలడం లేదనే ఆరోపణలున్నాయి. మల్లికార్జున సదన్ కౌంటర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి రెండేళ్లకు పైగా అక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

### ప్రమోషన్లు ఇచ్చి..పోస్టింగులు మరిచి!

దేవస్థానంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరికి సహాయ కార్యనిర్వహణాధికారులుగా, సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి పర్యవేక్షకులుగా గత ఏడాది డిసెంబరు 27న ప్రమోషన్లు ఇచ్చారు. కానీ ఇంతవరకు పోస్టింగులు ఇవ్వలేదు. గత మూడు నెలలుగా వారు గతంలో వారికి కేటాయించిన సీటులోనే విధులు నిర్వహిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం



అంతర్గత బదిలీలు పరిపాలన సౌలభ్యం కోసం చేపట్టే అంశం. ఈ విషయం పరిపాలనకు సంబంధించిన అంశం. నేను ఈఓగా వచ్చి మూడు నెలలు మాత్రమే అవుతుంది. అప్పటి నుంచి సంక్రాంతి, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ పైనే ప్రత్యేక దృష్టి సారించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎవరెవరు ఎన్ని నెలలుగా ఒకే సీటులో ఉంటున్నారనే విషయంపై పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. – ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి